క్లుప్తంగా

9, 10 తేదీల్లో సర్పంచ్‌లకు శిక్షణ

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9, 10వ తేదీల్లో పంచాయతీలకు ఆదాయం సమకూర్చే మార్గాల అన్వేషణపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో బి.వెంకటరమణ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని, మండలంలోని 34 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

వినతిపత్రం అందజేత


వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధిలో ఉన్న ఎస్.గోపాలపురం కాలనీ, దశమంతుపురం సచివాలయం పరిధిలోని సింధునగర్, పెద్దూరు, వీరఘట్టం మేజరు పంచాయతీ పరిధిలోని అచ్చువలస గ్రామాలను కలిపి పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల గిరిజనులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు ఎంపీడీవో బి.వెంకటరమణను మండల కేంద్రంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సదరు ఐదు గ్రామాల్లో 900 మంది జనాభా ఉన్నారని తమకు కేటాయించిన పంచాయతీలు దూరంగా ఉన్నందున రేషన్, ఇతర ధ్రువపత్రాలు తీసుకునేందుకు అవస్థలు పడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామాలను ఒక పంచాయతీగా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గణేష్, జీవ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బోధనా సామగ్రి వితరణ

భామిని: మండలంలోని బొడ్డగూడలో ప్రజ్వల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వయోజన కేంద్రాల నిర్వాహకులకు బోధనా సామగ్రి సోమవారం వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కన్వీనర్ ఫాదర్ ప్రేమానందం, జిల్లా సమన్వయకర్త ఎం.భీష్మ తదితరులు పాల్గొన్నారు.

అమల్లోకి కొత్త పీస్ రేట్ ఒప్పందం

బలిజిపేట: మండలంలోని మార్కెట్ కలాసీలకు, కిరాణా కొట్టు యజమానుల మధ్య జరిగిన కొత్త పీస్ రేట్ ఒప్పందం అమల్లోకి వచ్చిందని సీఐటీయూ నాయకుడు మన్మథరావు తెలిపారు. ఈమేరకు అమల్లోకి వచ్చిన ఒప్పందాన్ని సోమవారం విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల కిందట చేసుకున్న ఒప్పందం ఈ నెల 5వ తేదీతో ముగియడంతో.. కొత్త ఒప్పందం చేసుకుని ఆరో తేదీ నుంచి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఆవాలు తవుడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌కు ఏర్పాట్లు

బలిజిపేట: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 7, 8 తేదీలలో నిర్వహించనున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ -1 సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో చేపడుతున్న ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 7వ తేదీన కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు.. 8న చెస్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని చెప్పారు. మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటనాయుడు, పీఈటీలు షేక్‌సుభాని, డి.సీతంనాయుడు, లక్ష్మణదొర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

సీతానగరం: మండలంలోని జోగింపేట విద్యాలయాల విద్యార్థినులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా కేజీబీవీ విద్యార్థినులకు హెల్త్ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పరీక్షించారు. చర్మవ్యాధులతో పలువురు బాధపడుతున్నట్లు గుర్తించి, మందులు అందజేశారు. అలాగే గిరిజన ప్రతిభా విద్యాలయంలో కూడా వైద్య పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో విద్యాలయాల సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు తక్షణమే పరిష్కరించండి

- జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పార్వతీపురం రూరల్: రెవెన్యూ సమస్యలతో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వినతులపై జేసీ సోమవారం సమీక్షించారు. గత వారంలో వచ్చిన అర్జీలపై కేసుల వారీగా, కేటగిరీ వారీగా ఆరా తీశారు. సమస్యలపై ఏయే చర్యలు తీసుకున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.హేమలత, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దోమకాటు..
పశువుల ఆరోగ్యానికి చేటు!


పశువులను ఇలా పరిశుభ్రమైన స్థలంలో ఉంచాలి..

- వర్షాకాలంలో పశువులకు వ్యాధుల ముప్పు
- జాగ్రత్త వహిస్తేనే మూగజీవాల రక్షణ
- వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన తప్పనిసరి

పాలకొండ రూరల్: దోమల కారణంగానే మనుషులే కాదు..పశువులూ అనారోగ్యానికి గురవుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో పశువులకు వ్యాధుల ముప్పు పొంచి ఉంది. లోతట్టు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో వర్షపునీరు నిల్వ ఉండిపోవడం, మురుగు కాలువల్లో పూడికలు పేరుకుపోవడం కారణంగా దోమలు విపరీతంగా పెరిగి అటు మనుషులు ఇటు మూగజీవాలపై దాడి చేస్తూ వ్యాధులను కలుగజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాడిరైతులు, పశు పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. వ్యాధుల బారినపడిన ఆవులు, గేదెల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో దోమల నుంచి పశువులను కాపాడుకోవాలని సలహా ఇస్తున్నారు.

22 వేలకు పైగా ఆవులు, గేదెలు..

పాలకొండ నియోజకవర్గంలో పశు సంపదకు కొదవలేదు. ఆవులు, గేదెలు కలిపి మొత్తం 22 వేలకు పైగా ఉన్నాయి. ప్రస్తుతం వానాకాలం నడుస్తుండడంతో పశువులు గాలికుంటు, గొంతువాపు, దొమ్ము, చర్మ సంబంధిత వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. ప్రధానంగా అవి ఉండే స్థలాలు అపరిశుభ్రంగా ఉంటే అక్కడ పెరిగే దోమలు మూగజీవాలను కుట్టి వ్యాధుల బారినపడేలా చేస్తాయి. ఈ నేపథ్యంలో పశువుల శాలలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. అలాగే పశువులకు పెట్టే దాణా(మేత) విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వీలైతే ఏ కాలంలో ఎటువంటి ఆహారం వాటికి పెట్టాలో పశువైద్యులను అడిగి తెలుసుకుని పెట్టాలి. పశువుల శాలల్లో దోమలు ఉండకుండా ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేస్తే మంచిది.

దోమకాటుతో సమస్యలివే..

- పశువులను దోమలు ఎక్కువగా కుడితే అవి మేత సరిగా తీసుకోకపోగా ఆకలి మందగించి ఫలితంగా పాల దిగుబడి తగ్గుతుంది
- పశువుల శరీర ఉష్ణోగ్రత పెరిగిపోతే రోజురోజుకూ బలహీనపడతాయి
- దోమలు కుట్టిన చోట దురద పుట్టి పుండ్లు ఏర్పడతాయి
- పశువుల మేత నిల్వ చేసే ప్రాంతాలు, పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలి

అపరిశుభ్రతతోనే సమస్యలు..



అపరిశుభ్రతతోనే సమస్యలు నెలకొంటున్నాయి. పరిసరాలు శుభ్రంగా లేకపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి. పశువులను ఉంచే స్థలాలు చెత్తాచెదారంతో ఉండకుండా జాగ్రత్త వహించాలి. పశువులకు అందించే మేత విషయంలోనూ
పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పాడి రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి. పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మేత, దాణాకు అందించే పాత్రలు కూడా శుభ్రం చేయాలి.

–ప్రభా మాణిక్యరావు, పశుసంవర్థక శాఖ ఏడీ, పాలకొండ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

దోమల బారినపడకుండా పశువులను కాపాడాలంటే జాగ్రత్తలు పాటించాలి. పశువులు ఉండే శాలలు నలువైపులా దోమతెరలు వాడాలి. సాయంత్రం పశువులు కట్టే పాకలో వాటిని కట్టడానికి ముందే ఆ స్థలాన్ని శుభ్రం చేసుకుని వేపాకులు లేదా సాంబ్రాణితో పొగపెట్టాలి. అలాగే పశువుల పాకల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వ్యాధుల బారినపడిన పశువులను పశువైద్య శాలలకు తీసుకువెళ్లి, సకాలంలో చికిత్స అందేలా చూడాలి.

నేటి నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్

గుమ్మలక్ష్మీపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మంగళవారం నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు బి.చంద్రశేఖర్, బి.భీముడు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 7వ తేదీన కబడ్డీ, వాలీబాల్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని, 8వ తేదీన ఖోఖో, అథ్లెటిక్స్, చెస్ పోటీలు ఉంటాయన్నారు. 1.1.2009 తర్వాత జన్మించిన ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటు 1.1.2012 తర్వాత జన్మించిన విద్యార్థులంతా ఈ పోటీలలో పాల్గొనేందుకు అర్హులన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు


ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని ఎంపీపీ కుంబురుక దీనమయ్య విమర్శించారు. కురుపాంలోని శివ్వన్నపేట గురుకుల పాఠశాల విద్యార్థినులు పువ్వల అంజలి, తోయక కల్పనలు పచ్చకామెర్లతో చనిపోగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పాలనలో విఫలం కావడం వల్లే విద్యార్థినులు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థినుల మరణాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించి, అధికారులను అప్రమత్తం చేయకుంటే ఇంకెంతమంది విద్యార్థుల ప్రాణాలు పోయేవోనన్నారు. అదే పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులు విశాఖ కేజీహెచ్, మరో 93 మంది పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. మిగతా విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించి వారికి మెరుగైన వైద్యం అందేలా మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన


కురుపాం గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కురుపాం: స్థానిక బాలికల గురుకుల పాఠశాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సందర్శించారు. బాలికల అస్వస్థతకు గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌ఓను, గిరిజన సంక్షేమ అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు వినియోగిస్తున్న తాగునీరు శాంపిల్స్‌ను విజయవాడ పంపించామని, పచ్చకామెర్ల వ్యాప్తికి కారణాలు తెలుస్తాయన్నారు. బాలికలు తినే ఆహారంపైనా ప్రత్యేక బృందాలు అధ్యయనం చేస్తున్నాయని తెలిపారు. 611 మంది విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, గదులు లేవని, అదనపు భవన నిర్మాణం కూడా చివరి దశలోనే నిలిచిపోయిందని, అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల విరేష్ చంద్రదేవ్, వైద్య శాఖ, ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఉన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి


అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

భామిని: వన్యప్రాణుల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కొత్తూరు ఫారెస్ట్ అధికారులు దాలినాయుడు, కేశవలు కోరారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పోలవరం గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణపై సోమవారం ప్రచారం నిర్వహించారు. జీవవైవిధ్యానికి ప్రతి జీవి బతికి ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


గురుకుల పాఠశాల సిబ్బందికి సూచనలిస్తున్న న్యాయమూర్తి సౌమ్య జోస్పిన్

కురుపాం: విద్యార్థుల మెరుగైన ఆరోగ్యమే లక్ష్యంగా వారికి పౌష్టికాహారం అందివ్వాలని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోస్పిన్ సూచించారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల(బాలికలు)లో ఇద్దరు విద్యార్థినులు పచ్చకామెర్లతో చనిపోయిన నేపథ్యంలో ఆ పాఠశాలను ఆమె సోమవారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠశాల పరిసరాలతో పాటు విద్యార్థుల వసతిగృహాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అలాగే ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండను జిల్లాగా ప్రకటించాలి

పాలకొండ రూరల్: పాలకొండను జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన సమితి సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై సమితి గౌరవాధ్యక్షుడు కనపాక చౌదరి నాయుడు సోమవారం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ను కలిసి పాలకొండ ప్రాంతవాసుల ఆకాంక్షను తెలియజేశారు. జిల్లా కావడానికి కావాల్సిన అన్ని అర్హతలు పాలకొండకు ఉన్నాయని, పాలకొండ పాత డివిజన్ పరిధిలోని అన్ని మండలాలతో కలిపి జిల్లా చేయాలని కోరారు. ఆయన వెంట సమితి అధ్యక్షుడు బి.అప్పలనాయుడు, కోశాధికారి నానాజీరావు తదితరులు ఉన్నారు.

మానసిక ఆరోగ్య వారోత్సవాలు

సీతంపేట: పీఎం శ్రీ పథకంలో భాగంగా మండలంలోని హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలలో మానసిక ఆరోగ్య వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బి.ఉమావాణి..మానసిక ఆరోగ్యానికి పాటించాల్సిన సూచనలను విద్యార్థులకు తెలిపారు. అనంతరం మానసిక ఆరోగ్య ప్రతిజ్ఞ చేశారు.

పాలకొండ రూరల్: మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా స్థానిక పెద్దకాపు వీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు, ఉపాధ్యాయులు తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు

వీరఘట్టం: మండలంలోని పెద్దూరు, మూలలంక, చినగోరకాలనీ, గాదిలంక, ఎస్.గోపాలపురం, అచ్చువలస తదితర గిరిజన గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారి రక్త నమూనాలు సేకరించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు.

మెగా నేత్రవైద్య శిబిరం రేపు

వీరఘట్టం: మండల కేంద్రంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీసత్యసాయిబాబా మందిరం వద్ద ఈ నెల 8వ తేదీన మెగా నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవా సమితి నిర్వాహకులు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో విశాఖ పట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్య సిబ్బంది కళ్లను తనిఖీ చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడంతో పాటు శస్త్రచికిత్స కూడా చేస్తారన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, రేషన్‌కార్డులతో పాటు ఫోన్, బ్యాంకు ఖాతా పుస్తకం, జత బట్టు వెంట తీసుకురావాలన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ


వీరఘట్టాం: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: పట్టణంలోని నాగవంశపువీధికి చెందిన కృష్ణసాయి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం కలిసి పరామర్శించారు. ఇటీవల సీతంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంభవించిన కృష్ణసాయి మృతిపై ఆరాతీసి, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ పరంగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని అన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, పల్లా భాను, కడగల రమణ తదితరులు ఉన్నారు.

వీరఘట్టం: మండలంలోని కడకెల్లకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మర్రాపు నరసింహనాయుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ విక్రాంత్..అక్కడకు కూడా వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నరసింహనాయుడు మృతి పట్ల సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ డి.వెంకటరమణనాయుడు, సర్పంచ్ డి.సుజాత, శ్రీనివాసరావు, గౌరీశంకర్, శంకరరావు, సూర్యనారాయణ, అప్పలనారాయణ ఉన్నారు.


విద్యార్థిని తల్లిని ఓదార్చుతున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

కురుపాం: పచ్చకామెర్లతో మృతి చెందిన స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థిని తోయక కల్పన కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి పరామర్శించారు. సోమవారం విద్యార్థిని గ్రామమైన దండుసూరకు వెళ్లి, విద్యార్థిని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. తమ సమస్యను స్థానిక ఎమ్మెల్యేకు ఫోన్‌లో గ్రామస్తులు తెలిపినా ఆమె స్పందించలేదని, రాంగ్ నంబర్ అని అన్నారని మృతురాలి తల్లి జయలక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. తామంతా ఉన్నామని ధైర్యంగా ఉండాలని పుష్పశ్రీవాణి ఓదార్చారు. ఆమె వెంట ఎంపీపీలు శెట్టి పద్మావతి, దీనమయ్య, జెడ్పీటీసీ గొర్లి సుజాత, సర్పంచ్ శెట్టి సురేష్ తదితరులు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో దిగొచ్చిన ధరలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: జీఎస్టీ తగ్గింపుతో ధరలు దిగివచ్చాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీవరం కోరారు.

అదే కళాశాలలో సోమవారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. సెప్టెంబరు 22వ తేదీ నుంచి సవరించిన కొత్త జీఎస్టీ శ్లాబ్‌లు అమలులోకి వచ్చాయని, దీంతో కొన్ని నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గాయని అధ్యాపకురాలు కల్పన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించి, కొత్త జీఎస్టీ శ్లాబ్‌ల ద్వారా ఏయే వస్తువులు ఏ మేర తగ్గాయన్న విషయాలను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దోనుబాయిలో ఫీవర్ సర్వే


కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: మండలంలోని దోనుబాయి గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే సోమవారం చేపట్టారు. జ్వర పీడితులు, జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వైద్యసేవలు పొందేలా వైద్యాధికారి పవన్, సిబ్బంది అవగాహన కల్పించారు. ఎవరైనా అనారోగ్యంతో బాధపడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుని వద్దకు వెళ్లాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల బారినపడకుండా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో అభివృద్ధి పనుల గుర్తింపు


గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ ఉపేంద్ర

పాలకొండ రూరల్:

అభివృద్ధి పనుల గుర్తింపు కోసమే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్ర అన్నారు. మండలంలోని లుంబూరు గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రానున్న ఏడాది ఉపాధి పనులకు సంబంధించి రూ.1.5 కోట్ల వ్యయంతో పనులు గుర్తిస్తున్నట్లు తెలిపారు. రైతులకు మేలు చేకూరేలా ఉపాధి పనులు జరుగుతాయని ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సభలో టెక్నికల్ అసిస్టెంట్ రోజారమణి, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారం దొంగ అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బంగారం చూపిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని నోంద్రుకోన పంచాయతీ, కొత్తవలస గ్రామానికి చెందిన సీమల కొండలరావు ఇంట్లో జరిగిన బంగారం చోరీ ఘటనకు సంబంధించి నిందితుడు పల్లెరిక సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ సోమవారం తెలిపారు. సెప్టెంబరు 12వ తేదీన ఆశ కార్యకర్తనని పంజాబీ డ్రెస్‌లో కొండలరావు ఇంటికి వెళ్లిన సురేష్.. ఇంట్లో ఎవరికైనా బాగోలేకపోతే చెప్పాలని అడిగాడు. అందరికీ బాగుందని బాగాలేని వారు ఎవరూ లేరని వారు చెప్పి, పొలానికి కుటుంబమంతా వెళ్లిపోయారు. ఇదే అదనుగా భావించిన సురేష్.. ఆ ఇంట్లోకి వెళ్లి బీరువాలోని 2 బంగారం ఉంగరాలు, ఒక జత చెవిదిద్దులు(ఒకటిన్నర తులాల బంగారం) పట్టుకుపోయాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కొండలరావు ఇంట్లో బంగారం దొంగిలించబడిందని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిది పెదఖర్జ గ్రామంగా గుర్తించి, గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సోమవారం పట్టుకుని, స్టేషన్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి బంగారం రికవరీ చేశారు.

గౌరీ పౌర్ణమి సందడి

వాడవాడలా గౌరీపౌర్ణమి సందడి నెలకొంది. గంగాగౌరీ సమేత నందీశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు తమ ఇళ్ల ముంగిట గౌరమ్మ(వరిదుబ్బు)ను ప్రతిష్ఠించి, చంద్ర దర్శనంతో పూజలు చేసి ముత్తయిదులకు వాయినాలు అందించారు.

-పాలకొండ రూరల్, భామిని, గరుగుబిల్లి, జియ్యమ్మవలస


పాలకొండ రూరల్: కోమటిపేటలో నందీశ్వరునికి పూజలు చేస్తున్న మహిళలు


జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో నందెన్న ఊరేగింపు